సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



అడ్డగోలుగా అదనపు సెక్షన్లు

ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి విద్యార్థుల భవితతో చెలగాటమాడుతున్నాయి. 8లో



కచ్చితమైన ఓటర్ల జాబితా

జిల్లాలో కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. 8లో

20 మంది ఎస్‌ఐలకు స్థానచలనం



నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 20 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో

న్యూస్‌రీల్

టీ 20కి భారీ బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 23న జరగనున్న టీ 20 మ్యాచ్‌కు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. టికెట్ల విక్రయం నుంచి మ్యాచ్‌కు వచ్చే అతిథులు, అంతర్జాతీయ క్రీడాకారుల భద్రత, బందోబస్తుపై గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. శుక్ర, శని వారాల్లో మ్యాచ్ టికెట్లు ఆఫ్‌లైన్‌లో పీఎంపాలెంలోని స్టేడియం బీ గ్రౌండ్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గాజువాకలోని రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో విక్రయిస్తున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే మ్యాచ్‌కు వచ్చే క్రీడాకారులు, అతిథుల బందోబస్తుపై చర్చించారు. అభిమానులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా ఉండేలా పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

20న మాజీ ఉపరాష్ట్రపతి రాక



మహారాణిపేట: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ నెల 20న విశాఖ వస్తున్నారు. ఆ రోజు ఉదయం 9.05 గంటలకు ఇండిగో విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి పోర్టుగెస్ట్ హౌస్‌కు చేరుకుని.. బస చేస్తారు. 21న పోర్టుగెస్ట్ హౌస్‌లోనే ఉంటారు. 22న ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు బీచ్‌రోడ్డులోని పార్కు హోటల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం పోర్టుగెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. 23న పోర్టుగెస్ట్ హౌస్‌లోనే బస చేస్తారు. 24న ఉదయం 11 గంటలకు రాజ్యసభ మాజీ సభ్యుడు, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ 70వ జన్మదిన వేడుకల్లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం 4.35 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

ఏపీ సెట్ మెంబర్ సెక్రటరీగా జగన్నాథరాజు



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య రాజు

ఏయూక్యాంపస్: రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష (ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు–ఏపీసెట్) మెంబర్ సెక్రటరీగా ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగ ఆచార్యులు జి.ఎం.జగన్నాథరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా ఆచార్య జి.ఎం.జగన్నాథ రాజును ఏయూ వీసీ పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏపీ సెట్ పూర్వ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

18న జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 18న జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. హెటిరో సంస్థలో క్వాలిటీ కంట్రోల్, జూనియర్ కెమిస్ట్, జూనియల్ టెక్నీషియన్ విభాగాలలో ఐటీఐ, డిప్లమా, బీఎస్సీ, బీ ఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మెడ్‌ప్లస్ సంస్థలో ఫార్మసిస్ట్, సీఎస్ఏ, ఆడిట్ విభాగాల్లో ఉద్యోగాలకు పదో తరగతి, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఆరోజు ఉదయం 10.30 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 966609249 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఎస్బీఐ వాలీబాల్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: ఎస్బీఐ అంతర్ సర్కిళ్ల వాలీబాల్ పోటీలు గురువారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 16 సర్కిళ్ల జట్లు నాలుగు రోజుల పాటు పోటీపడనున్నాయి. స్థానిక ఎల్‌డీఎం, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ఈ పోటీలు జరుగుతున్నాయి.

పంచ గ్రామాలకు తీపికబురు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం
- ఇళ్ల మరమ్మతులకు అనుమతి



పంచగ్రామాల వ్యూ

సింహాచలం: పంచ గ్రామాల ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏళ్ల తరబడి ఇళ్ల మరమ్మతుల కోసం ఎదురుచూసున్న నివాసితులకు ఊరట కల్పించింది. ఏ ప్రభుత్వం తీసుకోని సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని.. ఇళ్ల మరమ్మతులు చేసుకునే వీలు కల్పిస్తూ అధికారికంగా మెమో జారీ చేసింది. దీంతో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల నివాసితుల బాధలు తొలగనున్నాయి.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో పంచ గ్రామాలు ముడిపడి ఉన్నాయి. అడవివరం, వేపగుంట, చీమలాపల్లి, వెంకటాపురం, పురుషోత్తపురం గ్రామాల్లోని దేవస్థానం భూములకు సంబంధించి 1996–97 నుంచి భూ వివాదం నడుస్తోంది. అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలోనే.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పంచ గ్రామాల భూ సమస్య ప్రారంభమైంది. అప్పటి చినగదిలి, పెందుర్తి తహసీల్దార్లు రైత్వారీ పట్టాలు దేవస్థానానికి ఇవ్వడంతో ఈ సమస్య మొదలైంది. దీంతో 27 ఏళ్లగా భూ సమస్య ఉంది. గడిచిన కొన్నేళ్లగా ఇళ్ల మరమ్మతులు కూడా చేసుకోని పరిస్థితి నెలకుంది. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లోనే పలువురు కాలం వెళ్లదీస్తున్నారు. వర్షం వచ్చినా, ఎండ వచ్చినా బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఓ పక్క పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరించాలని, మరో పక్క ఇళ్ల మరమ్మతులకు అనుమతివ్వాలని ప్రజలు ఎప్పటికప్పుడు తమ గోడు వినిపిస్తున్నారు. ఈ విషయంపై గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించేందుకు కంకణం కట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే ఈ సమస్య పరిష్కారానికి కమిటీ వేశారు. ఆ తర్వాత ఆ కమిటీలను విస్తరించారు. సమస్య కోర్టు పరిధిలో ఉండటంతో ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. నివాసితుల బాధలను అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను మరమ్మతులు చేసుకునే విధంగా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పంచ గ్రామాల్లోని ఇళ్లను మరమ్మతులు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికల్ వలెవన్ మెమో జారీ చేశారు.

మెమోలోని అంశాలివీ..

- ప్రస్తుతం ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఎలా ఉన్నాయో.. వాటిని మాత్రమే మరమ్మతులు చేసుకోవాలి.
- మరమ్మతులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ముందుగా దేవస్థానానికి నివాసితులు అందించాలి. ప్రతీ అంశం క్షుణ్ణంగా పరిశీలించి దేవస్థానం అనుమతి ఇవ్వాలి.
- మరమ్మతులు తప్పించి.. మరెలాంటి నిర్మాణాలు గానీ, అదనంగా ఎటువంటి మార్పులు చేయడానికి వీలు లేదు.
- ఎప్పటికప్పుడు ఆ నిర్మాణాలను దేవస్థానం విజిలెన్స్ విభాగం పరిశీలించాలి.

అన్ని వివరాలతో ప్రకటన జారీ చేస్తాం



పంచ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం జారీ చేసిన మెమోకి సంబంధించి అన్ని వివరాలతో ప్రకటన జారీ చేస్తాం. ఈ విషయంపై కలెక్టర్‌తో చర్చిస్తాం. ఎవరైతే ఇళ్లు కట్టుకుని ఉంటున్నారో.. వారి ఇళ్లకు సంబంధించి మరమ్మతులు చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. త్వరలోనే నివాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. ఆ తర్వాత ఇల్లు ఏ విధంగా ఉందో పరిశీలిస్తాం. అనంతరం మరమ్మతులకు అనుమతిస్తాం. ఎప్పటికప్పుడు విజిలెన్స్ పరిశీలన ఉంటుంది.

– ఎస్.శ్రీనివాసమూర్తి, ఈవో, సింహాచలం దేవస్థానం

రోడ్లకు కొత్త రూపు!

- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.138.25 కోట్లు మంజూరు
- వీటిలో బాగా దెబ్బతిన్న రోడ్లకు రూ.66.55 కోట్లు
- గుంతలు పూడ్చడానికి మరో రూ.71.70 కోట్లు
- ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి కానున్న పనులు




పద్మనాభం కొండపైకి వెళ్లే రోడ్డు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రోడ్లు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో పంచాయతీరాజ్ శాఖకు చెందిన కొన్నిచోట్ల రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. మరికొన్ని రోడ్లకు గుంతలు పడ్డాయి. ఇప్పుడు ఇలాంటి రహదార్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నారు. బాగా దెబ్బతిన్న రోడ్ల స్థానంలో లేయర్లతో సరికొత్తగా వేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ అధీనంలోని రోడ్ల పరిస్థితిపై ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం రాష్ట్రంలో 1,035 కిలోమీటర్ల పొడవున 202 పనులకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.784.23 కోట్లను మంజూరు చేసింది. వీటిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి హై ఇంపాక్ట్ (బాగా దెబ్బతిన్న) 20 రోడ్ల పనులు, 89 గుంతల రోడ్ల పనులు ఉన్నాయి. 85 కిలోమీటర్ల మేర హై ఇంపాక్ట్ రోడ్ల పనులకు రూ.66.55 కోట్లు, 263 కిలోమీటర్ల మేర గుంతల రోడ్ల మరమ్మతు పనులకు రూ.71.70 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాల వారీగా చూస్తే విశాఖ జిల్లాలో పద్మనాభం మండల కేంద్రం నుంచి పద్మనాభ స్వామి కొండపైకి వెళ్లే 3 కిలోమీటర్ల హిల్ టాప్ రోడ్డుకు రూ.5 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 19 పనులకు రూ.62 కోట్లు మంజూరు చేశారు. వీటికి ఇటీవల టెండర్లు పిలిచారు. ఇక రోడ్ల గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టడానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వం రూ.71.70 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో మొత్తం 89 పనులను చేపడుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 27 పనులకు రూ.35.59 కోట్లు (118.23 కిలోమీటర్లు), అనకాపల్లి జిల్లాలో 49 పనులకు రూ.32.30 కోట్లు (120 కి.మీలు), విశాఖపట్నం జిల్లాలో 13 పనులకు రూ.3.82 కోట్లు (23.52 కి.మీలు) మంజూరయ్యాయి.

వీటిలో ఏఎస్సార్ జిల్లాలో 20 పనులకు టెండర్లు పిలవగా, ఏడు పనులు ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లాలో ఎనిమిది పనులకు, విశాఖ జిల్లాలో 13 పనులకు టెండర్లు పిలిచారు. అనకాపల్లి జిల్లాలో మాడుగుల మండలం కేజేపురం– అప్పలరాజుపురం రోడ్డు, చీడికాడ–కోనాం (వయా సిరిజాం) రోడ్డు పనులు ఇప్పటికే పూర్తి చేశారు. మిగిలిన హై ఇంపాక్ట్ రోడ్లు, గుంతలు పూడ్చే పనులు ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి చేయనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు 'సాక్షి'కి చెప్పారు.

అందుబాటులోకి ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్

- నిర్వహణ బాధ్యతలు ఏజెన్సీకి అప్పగింత
- నెలకు ఒక్కొక్కరికి ఫీజు: పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.500



ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ ప్రమాణాలతో బీచ్ రోడ్డులో సిద్ధం చేసిన ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నగర ప్రజలు, క్రీడాకారులకు అందుబాటులో ఉంచినట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణలో లోపాలు కారణంగా భారీ మరమ్మతులకు గురై.. కొన్నాళ్లు మూతపడిందన్నారు. ఈ నేపథ్యంలో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టామన్నారు. రేసింగ్ పూల్, డైవింగ్ పూల్, బేబీ పూల్‌ను అత్యాధునికంగా ఆధునికీకరించినట్లు వెల్లడించారు. గత అనుభవాల దృష్ట్యా.. కాంప్లెక్స్ నిర్వహణ బాధ్యతలను టెండర్ ప్రక్రియ ద్వారా అనుభవం గల ఏజెన్సీని ఎంపిక చేసి.. మూడేళ్ల కాల పరిమితికి అప్పగించినట్లు చెప్పారు. కాంప్లెక్స్ నిర్వహణకు అవసరమయ్యే సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, సాంకేతిక సిబ్బంది, స్విమ్మింగ్ కోచ్ జీతాలు, విద్యుత్, నీటి చార్జీలను ఏజెన్సీయే భరించాల్సి ఉంటుందన్నారు. ప్రజల నుంచి అధిక ఫీజు వసూలు చేయకూడదని నిబంధన విధించినట్లు స్పష్టం చేశారు. అందరికీ అందుబాటులో ఉండేలా పెద్దలు ఒక్కరికీ నెలకు రూ.750, పిల్లలు ఒక్కొక్కరికి నెలకు రూ.500గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులో ఉంటుందని.. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

మైనారిటీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ వెల్లడి



వినతులు స్వీకరిస్తున్న రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్, కమిషన్ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మైనారిటీలైన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు సంబంధించిన సమస్యలపై గురువారం కలెక్టరేట్‌లో ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 48 సమస్యలపై వినతులు, ఫిర్యాదులను స్వీకరించినట్లు చెప్పారు. వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు పంపి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 67 సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల శ్రేయస్సు కోసం ఎంతగానో కృషి చేస్తోందని.. వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు. మంగళగిరిలో కమిషన్ కార్యాలయం ఉందని, అంత దూరం రాలేని మైనారిటీల కోసం జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. మైనారిటీలకు ఎక్కడ ఏ అన్యాయం జరిగినా, వాటిని లిఖిత పూర్వకంగా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. మైనారిటీ కమిషన్ మెంబర్ సయ్యద్ హిదయతుల్లా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మైనారిటీల సమస్యలు విని పరిష్కరించాలన్న ఉద్దేశంతో జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. మరో మెంబర్ షేక్ సైపుల్లా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్.జ్యోతి మాధవి, కమిషన్ వైస్ చైర్మన్ ఎ.జాషువా డేనియల్, సెక్రటరీ దుర్గా ప్రసాద్ సాహు, కమిషన్ సభ్యుడు జితేందర్ జీత్ సింగ్, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వీకరించిన వినతుల్లో కొన్ని..

- దసపల్లా హిల్స్ నుంచి సతీందర్ సింగ్ సేతి చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తూ.. తనపై పోలీసులు అక్రమ కేసులు, అట్రాసిటీ కేసులు పెట్టి బెదిరిస్తున్నారని, తగిన న్యాయం చేయాలని కోరారు.
- ప్రభుత్వ భవనాలు, పథకాలు శంకుస్థాపన కార్యక్రమ శిలాఫలకాలపై మైనారిటీ వర్గాలకు చెందిన పేర్లు రాయడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయనగరం జిల్లా భోగాపురం నుంచి షేక్ మదీనా సాహెబ్ దరఖాస్తు అందించారు.
- అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్ల నియామకాల్లో మైనారిటీలకు అవకాశం కల్పించాలని, వక్ఫ్ బోర్డుకు మౌలిక వసతులతో పాటు ఫర్నిచర్ కల్పించాలని కోరుతూ శ్రీకాకుళానికి చెందిన జామియా మసీద్ మేనేజ్ మెంట్ కమిటీ అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్ వినతిపత్రం అందజేశారు.

సముద్ర జలాల కాలుష్య నియంత్రణకు నివేదిక ఇవ్వండి

వీఎంఆర్‌డీఏ కమిషనర్, కలెక్టర్ మల్లికార్జున



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

దొండపర్తి : సముద్రంలోకి ప్రవహించే వ్యర్థాలు, మురుగునీటితో సముద్ర జలాలు కలుషితం కాకుండా ఉండేందుకు నివారణ చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన సముద్ర జలాలు కలుషితం కాకుండా చేపట్టాల్సిన నివారణ చర్యలపై కమిటీ సమావేశం నిర్వహించారు. కొత్త ఎస్టీపీలు/ఈటీపీలు నిర్మించడం ద్వారా లేదా ఇప్పటికే ఉన్న వాటి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సభ్యులకు సూచించారు. సముద్ర జలాలు కలుషితం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై వీలైనంత త్వరగా నివేదిక అందజేయాలని సభ్యులకు సూచించారు. జీవీఎంసీ, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ద్వారా నిర్వహిస్తున్న 18 మురుగునీటి శుద్ధి కర్మాగారాల ఇన్‌లెట్, అవుట్‌లెట్లు వ్యర్థాలు/మురుగునీటిని సమర్థవంతంగా శుద్ధి చేయడానికి సరిపోతాయన్నారు. అయితే ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్తులో డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని నగరంలో అదనపు మురుగునీరు/ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సిన స్థలాలను కూడా కమిటీ సూచించాలన్నారు. వీటిపై నాలుగు వారాల్లోగా హైకోర్టు నివేదిక కోరినందున, వీలైనంత త్వరగా తమకు నివేదిక అందజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త డి.సౌమ్య, కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జి.నాగిరెడ్డి, ఏయూ సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి ప్రొఫెసర్ వజీర్ మహ్మద్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ వైస్ చైర్మన్‌గా గిరిబాబు



గిరిబాబును అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, జెడ్పీటీసీ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా సుంకర గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీలు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీకి చెందిన 25 మంది జెడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్, ముంచంగిపుట్టు జెడ్పీటీసీ సభ్యురాలు జె.సుభద్ర.. పద్మనాభం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు పేరును వైస్ చైర్మన్ పదవికి ప్రతిపాదించారు. పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు బలపరిచారు. ఈ పదవికి మరొకరి పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో గిరిబాబు జెడ్పీ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన వైస్ చైర్మన్ గిరిబాబును భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జెడ్పీటీసీ సభ్యులు అభినందించారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ తనకు వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నెరవేరుస్తానని చెప్పారు.

వైద్యరంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం

- ఇన్నోవేషన్ భాగస్వాములతో కలిసి విప్లవాత్మక మార్పులు
- వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇన్నోవేషన్ హబ్ హెడ్ లూయిస్ అగెర్‌స్నాప్
- ఏపీ మెడ్‌టెక్‌జోన్‌లో ముగిసిన 3 రోజుల వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం



వివిధ దేశాల ప్రతినిధులతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇన్నోవేషన్ హబ్ హెడ్ లూయిస్ అగెర్‌స్నాప్

సాక్షి, విశాఖపట్నం : వైద్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు నిర్దేశించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించుకునే దిశగా అడుగులు పడుతున్నాయని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఇన్నోవేషన్ హబ్ హెడ్ లూయిస్ అగెర్‌స్నాప్ అన్నారు. విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం ముగింపు సదస్సు గురువారం జరిగింది.

ఈ సందర్భంగా లూయిస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఆరోగ్య ఆవిష్కరణలకు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇన్నోవేషన్ భాగస్వాములతో కలిసి వైద్య పరికరాల తయారీలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయన్నారు. దిగువ, మధ్య ఆదాయ దేశాల్లో జాతీయ, స్థానిక ప్రభుత్వాల ఆరోగ్య ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆవిష్కరణల్ని ప్రోత్సహించనున్నామన్నారు. ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధులుగా ఉన్న క్యాన్సర్, మధుమేహం, గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్య స్థితిగతులకు సంబంధించిన అధునాతన చికిత్సలపై దృష్టిసారించాలని లూయిస్ సూచించారు. నాన్ క్రానిక్ డిసీజెస్(ఎన్‌సీడీ)లతో ఏటా 41 మిలియన్ల మంది మృత్యువాత పడుతుండగా ఇందులో మూడొంతుల మంది దిగువ, మధ్య ఆదాయ దేశాలకు సంబంధించినవారే ఉండటం దురదృష్టకరమన్నారు. ఖర్చుతో కూడుకున్నప్పటికీ వైద్య ఆవిష్కరణలతో లక్షల మంది ప్రాణాల్ని కాపాడగలమని లూయిస్ స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఫోరంలో 70 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు స్వరూపానందేంద్ర సరస్వతి జన్మదినోత్సవం



శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ జన్మదినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. చినముషిడివాడలోని శారదా పీఠంలో స్వామీజీ జన్మదిన వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పీఠం ప్రాంగణంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. పీఠంలోని నాగదేవతకు అభిషేకాలు చేస్తారు. స్వామీజీ కోసం పండితులు ఆయుష్య హోమం, అవహంతి హోమం చేపట్టనున్నారు. మధ్యాహ్నం జరగనున్న వేదసభలో పండితోత్తములు పలు అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం నిరుపేదలకు స్వామీజీ చేతుల మీదుగా వస్త్రదానం చేస్తారని పీఠం ప్రతినిధులు తెలిపారు. స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, హర్యానా, ముంబయి ప్రాంతాల్లో స్వామీజీ శిష్యులు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఏటా నాగుల చవితి రోజున స్వామీజీ జన్మదినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

క్లుప్తంగా

మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



కబడ్డీ కూతకు వెళ్తున్న క్రీడాకారిణి

విశాఖ స్పోర్ట్స్: ఏయూ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు గురువారం జరిగాయి. ఏయూ అనుబంధ కళాశాలలకు చెందిన కబడ్డీ క్రీడాకారిణులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. వీరి నుంచి ఏయూ జట్టును ఎంపిక చేసి దక్షిణ మండల అంతర్ వర్సిటీల కబడ్డీ పోటీలకు పంపనున్నారు. ముందుగా ఇండోర్ స్టేడియంలో ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ ఈ పోటీలను ప్రారంభించారు. ఏయూ పీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, పలు కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

బీసీ కులగణన చారిత్రక నిర్ణయం



మాట్లాడుతున్న ఉత్తరాంధ్రా బీసీ కన్వీనర్ డాక్టర్ సనపల లక్ష్మీ నరసింహ

సీతంపేట: రాష్ట్రంలో కులగణన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఉత్తరాంధ్ర బీసీ కన్వీనర్ డాక్టర్ సనపల లక్ష్మీనరసింహ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న వెనుకబడిన తరగతుల కులాల వారీగా జనగణన చేపట్టి.. వాటిని ఆధారంగా రాబోవు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, ఉద్యోగం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, బీసీలకు సీట్లు కేటాయింపు జరగాలన్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర బీసీ నాయకులు ఆకుల కాశీరత్నం, యశ్వంత్, గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గాజువాక మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం'

గాజువాక : గాజువాక మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఈనెల 18న నిర్వహించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా హెచ్‌వోడీలు, జీవీఎంసీ అధికారులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

అడ్డగోలుగా అదనపు సెక్షన్లు

- గుర్తింపు లేకుండానే ప్రైవేటు స్కూళ్ల నిర్వహణ
- పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లించే వేళ వెలుగులోకి...
- జిల్లాలో 76 ప్రైవేటు స్కూళ్లను బ్లాక్‌లిస్టులో పెట్టిన అధికారులు
- ఫీజు చెల్లింపునకు ఈనెల 20 వరకు గడువు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

విశాఖ విద్య: ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి విద్యార్థుల భవితతో చెలగాటమాడుతున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు/కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకపోవడంతో పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లించే వేళ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మధురవాడ బక్కన్నపాలెంలో గల ఓ కార్పొరేట్ పాఠశాలలో పదో తరగతిలో 545 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నా 2023 – 24 విద్యా సంవత్సరానికి పాఠశాల నిర్వహణకు ప్రభుత్వ గుర్తింపు లేదు. అదేవిధంగా భీమునిపట్నం మండలం ఆర్.తాళ్లవలసలోని మరో కార్పొరేట్ స్కూల్‌లో 403 మంది విద్యార్థులు చదువుతున్నా అదనపు సెక్షన్ల నిర్వహణకు అనుమతి లేదు. జిల్లాలో ఇలాంటి 76 ప్రైవేటు/కార్పొరేట్ స్కూళ్లు ఉన్నట్లు గుర్తించిన పరీక్షల విభాగం రాష్ట్ర అధికారులు వాటిని బ్లాక్ లిస్టులో పెట్టారు. పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు వేళ చోటుచేసుకున్న ఇలాంటి పరిణామాలతో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఖంగుతిన్నాయి.

ఎందుకిలా జరిగిందంటే...

ప్రైవేటు/కార్పొరేట్ స్కూళ్ల విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేసే క్రమంలో 2023 – 24 విద్యా సంవత్సరానికి గుర్తింపు / రెన్యువల్ కోసం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో 360 స్కూళ్లు నిర్వహిస్తుండగా, ప్రభుత్వపరమైన గుర్తింపు, రెన్యువల్ విషయంలో కొంతమంది నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారు. మౌలిక వసతులు, అర్హత గల ఉపాధ్యాయులు, ఫైర్ సేఫ్టీ, ట్రాఫిక్, జీవీఎంసీ భవన అనుమతులు వంటి పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే ఆన్‌లైన్ విధానం అమలుతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

తరగతులు ఒక చోట... ఫీజు చెల్లించేది మరోచోట

పదో తరగతి పరీక్షల ఫీజు పాఠశాల యూ – డైస్ కోడ్ ఆధారంగానే చెల్లించాలనే నిబంధన విధించారు. ఇలాంటి చర్యల ద్వారా జిల్లాలో కొన్ని కార్పొరేట్ స్కూళ్లు సాగిస్తున్న విద్యా వ్యాపారం వెలుగులోకి వచ్చింది. వాస్తవంగా పదో తరగతిలో ఒక సెక్షన్‌కు 60 మంది వరకు విద్యార్థులు వుండే అవకాశం ఉంది. ఆ తర్వాత ప్రతీ సెక్షన్‌కు 40 మందికి చొప్పున అనుమతులు తీసుకోవాలి. ఇందుకోసమని ప్రభుత్వానికి తగిన రుసుము చెల్లించాలి. విద్యాశాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో వందల సంఖ్యలో పదో తరగతి విద్యార్థులు ఉన్నప్పటికీ, అక్కడ ఒకే సెక్షన్‌కు ప్రభుత్వపరంగా అనుమతులు ఉన్నట్లు గుర్తించారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడినట్లైంది.

20 వరకు గడువు

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈ నెల 20 వరకు గడువు ఉంది. కొన్ని స్కూళ్లను బ్లాక్‌లిస్టులో పెట్టారనే విషయం బహిర్గతం కావడంతో పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రూ.50ల అపరాధ రుసుముతో ఈ నెల 25 వరకు, రూ.200ల అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 5 వరకు పరీక్షల ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఈలోగా అనుమతులు తెచ్చుకొని, బ్లాక్ లిస్టు నుంచి బయటపడేలా పాఠశాలల యాజమాన్యాలు అధికారులతో సంప్రదింపులు చేస్తున్నాయి. ఆన్‌లైన్ విధానంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనందున, ఈ విద్యా సంవత్సరానికి గతంలో మాదిరే ఆఫ్‌లైన్ విధానం ద్వారా అనుమతులు ఇస్తే, అందరికీ మేలు జరుగుతుందని ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు (అపుస్మా) డాక్టర్ సుంకర శ్రీనివాసరావు అన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులే పరిగణనలోకి..



ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు, రెన్యువల్ కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. అలా వచ్చిన వాటినే పరిగణనలోకి తీసుకుంటాం. ఆన్‌లైన్ విధానంలో తలెత్తిన సాంకేతిక సమస్యలు ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మా వద్దకు వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరిస్తున్నాం. విద్యార్థులకు నష్టం లేకుండా చూస్తున్నాం.

– ఎం.జ్యోతి కుమారి, ఆర్జేడీ, విశాఖపట్నం

అనుమతులున్న వాటికి అవకాశం



ప్రభుత్వ గుర్తింపు, రెన్యువల్ లేని స్కూళ్ల జాబితా రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ కార్యాలయం నుంచి వచ్చింది. గడువులోపు అనుమతులు తెచ్చుకున్న స్కూళ్ల వివరాలను ఎప్పటికప్పుడు డైరెక్టర్ కార్యాలయానికి పంపించి బ్లాక్ లిస్టు నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులందరికీ పరీక్ష రాసుకునేలా అవకాశం కల్పిస్తాం.

– ఎస్.మురళీమోహన్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్

డిసెంబర్ 7 నుంచి పాలిటెక్నిక్ గేమ్స్ మీట్



మాట్లాడుతున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల(గైస్) వేదికగా ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్(ఐపీఎస్‌జీఎం) నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కళాశాలలో ఐపీఎస్‌జీఎం ఏర్పాట్లపై గురువారం పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మీట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 9 ప్రభుత్వ, 19 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ మీట్‌లో పాల్గొనే బాలికలకు గైస్‌లో, బాలురకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. బాలురకు పాలిటెక్నిక్ కాలేజీ, బాలికలకు గైస్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, హైజంప్, లాంగ్ జంప్, 100మీ, 200మీ, 400మీ రిలే పరుగు పందెం తోపాటు బాలురకు ప్రత్యేకంగా 800మీ, 1500 రిలే పరుగు పందెం, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, షాట్‌పుట్, చెస్, టేబుల్ టెన్నిస్ నిర్వహిస్తామన్నారు. పోటీల విజయవంతానికి కళాశాలల ప్రిన్సిపాళ్లు, పీడీలు సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ ఆల్ పీడీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ పీడీ అబ్బాస్ బేగ్, ఇన్‌చార్జి పీడీ బొండా హేమేంద్ర ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

లోయలోకి దూసుకెళ్లిన మినీ వ్యాన్

- ఒకరి మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు
- కూలిపనులకు వెళ్తుండగా ప్రమాదం
- ఐనాడ వెళ్లే ఘాట్ రోడ్డులో ఘటన





ఐనాడ ఘాట్‌లో బోల్తా కొట్టిన మినీ వ్యాన్, (ఇన్‌సెట్) మృతి చెందిన నూకరాజు

సాక్షి,పాడేరు: మండలంలోని సలుగు నుంచి ఐనాడ వెళ్లే ఘాట్ రోడ్డులోని మినీ వ్యాన్ అదుపుతప్పింది. లోయలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్రంగా, నలుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. రాయికోట సమీపంలో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను హుటాహుటిన ఈదులపాలెం పీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని ప్రథమ చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. సలుగు పంచాయతీ ఈదులపాలెం గ్రామానికి చెందిన సుమారు 20మంది గిరిజనులు రాజమండ్రిలోని కూలి పనుల నిమిత్తం రాత్రి మినీ వ్యాన్‌లో బయలుదేరారు. ఐనాడ ప్రాంతంలోని ఘాట్ రోడ్డు వద్దకు వచ్చేసరికి మినీ వ్యాన్ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మోలం నూకరాజు (28) అక్కడికక్కడే మృతి చెందినట్టు పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇలావుండగా నూకరాజు మృతితో ఈదలపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాద సంఘటనపై పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. గాయపడిన గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు కల్పించాలని, ఉన్నత వైద్యసేవలకు కేజీహెచ్‌కు తరలించాలని వైద్య బృందాలకు ఆమె సూచించారు.

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం, హిందీభవన్‌లో డాక్టర్ స్నేహ వసుంధర రచించిన 'ఆన్ వైలింగ్ బాండ్స్' ఆంగ్ల గ్రంథావిష్కరణ
- మధ్యాహ్నం 3 గంటలకు సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వరల్డ్ ప్రీమెచ్యూరిటీ డే సెలబ్రేషన్స్

20 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

దొండపర్తి: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 20 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఐల పనితీరు, సాధ్యమైన మేర వారు కోరుకున్న ప్రాధాన్యతలను పరిగణలోకి తీసుకొని కొత్త స్థానాల్లో నియమించారు.

ఎస్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
సి.హెచ్.రామ్‌దాస్	సీఎస్‌బీ	ఎంవీపీ క్రైం
కె.సతీష్	సీఎస్‌బీ	టూ టౌన్ లా అండ్ ఆర్డర్
కె.వెంకటసురేష్	సీఎస్‌బీ	గోపాలపట్నం క్రైం
ఇ.చిన్నంనాయుడు	సీఎస్‌బీ	పెందుర్తి లా అండ్ ఆర్డర్
రెడ్డి అసిరితాత	సిటీ వీఆర్	పెందుర్తి లా అండ్ ఆర్డర్
ఎం.శ్రీను	సిటీ వీఆర్	ఎంవీపీ లా అండ్ ఆర్డర్
ఎన్.సింహాచలం	ఎంవీపీ లా అండ్ ఆర్డర్	త్రీటౌన్ లా అండ్ ఆర్డర్
సి.హెచ్.సూర్యనారాయణ	సిటీ వీఆర్	ఆరిలోవ లా అండ్ ఆర్డర్
జి.వాసుదేవరావు	సిటీ వీఆర్	ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్
ఆర్.ఉమామహేశ్వరరావు	సిటీ వీఆర్	పద్మనాభం క్రైం
ఆర్.మల్లేశ్వరరావు	పద్మనాభం క్రైం	స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్
ఎస్.శ్రీకాంత్	స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్	ఆరిలోవ ట్రాఫిక్
డి.వరలక్ష్మి	స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్	ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్
డి.రాము	సిటీ వీఆర్	ఎయిర్‌పోర్ట్ క్రైం
డి.రాము	త్రీటౌన్ లా అండ్ ఆర్డర్	సీఎస్‌బీ
ఐ.ప్రశాంతి	టూ టౌన్ లా అండ్ ఆర్డర్	సీసీఆర్‌బీ
ఎ.సత్యారావు	సీసీఆర్‌బీ	ఫోర్త్ టౌన్ క్రైం
డి.విశ్వనాథం	వన్‌టౌన్ ట్రాఫిక్	గాజువాక లా అండ్ ఆర్డర్
ఎం.రవికుమార్	గాజువాక లా అండ్ ఆర్డర్	కంచరపాలెం లా అండ్ ఆర్డర్
ఎల్.ఆర్.కె.నాయుడు	త్రీటౌన్ ట్రాఫిక్	సిటీ వీఆర్

సబ్ డివిజన్‌కు ఒక క్రైమ్ స్పాట్ టీమ్



కిట్లను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్

దొండపర్తి : ప్రతి సబ్ డివిజన్ ఒక క్రైమ్ స్పాట్ టీమ్‌ను వినియోగించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో క్లూస్ టీమ్ ప్రదర్శించిన క్రైమ్ స్పాట్ కిట్లు, వారి మెటీరియల్ ఆబ్జెక్ట్స్, ఎవిడెన్స్ కలెక్షన్ కిట్లను సీపీ పరిశీలించారు. నగర క్లూస్ టీమ్ విభాగం విధి విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ క్రైమ్ జరిగినా సాక్ష్యాలు పాడవక ముందే చేరుకొని ప్రతి సాక్ష్యం సేకరించాలని చెప్పారు. సీన్ ఆఫ్ అఫెన్స్ వద్ద పూర్తి సాక్ష్యాలు సేకరించడం కోసం తమ వద్ద ఉన్న అన్ని అత్యాధునిక కిట్లనూ పూర్తిగా వినియోగించాలన్నారు. సీన్ ఆఫ్ అఫెన్స్ వద్ద సేకరించిన ఆధారాలతో క్రైమ్ వెంటనే గుర్తించే విధంగా ఉండాలని, అందుకు అవసరమైన శిక్షణను ప్రతి క్లూస్ టీమ్ సిబ్బంది తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఫింగర్ ప్రింట్స్ సేకరణ, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగిస్తూ నేరస్తులను గుర్తిస్తున్న విధానాన్ని గమనించి మరింత అత్యాధునిక సాఫ్ట్‌వేర్ వినియోగంపై సూచనలిచ్చారు. అనంతరం నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో ఉన్న పోలీస్ ఆస్పత్రిలోను, కోర్టు మోనటరింగ్ సిస్టమ్ కార్యాలయాన్ని, సీటీసీ, హోమ్‌గార్డ్ ఆఫీస్ పరిశీలించి అవసరమైన చోట్ల పలు మార్పులు సూచించారు. అన్ని కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ జి.నాగన్న, ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితాకు చర్యలు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ మల్లికార్జున వివరణ

మహారాణిపేట: అత్యంత పారదర్శకతతో కూడిన కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ మాట్లాడారు. జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనలు తు.చ. తప్పకుండా పాటిస్తున్నామని చెప్పారు. ఇంటింటికీ సర్వే నిర్వహిస్తూ డూప్లికేట్ ఓటర్లను గుర్తిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. అర్హులకు ఎపిక్ కార్డులను పోస్టల్ ద్వారా పంపించామన్నారు.

రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులకు తక్షణం పరిష్కారం చూపామని చెప్పారు. వచ్చే సమావేశం నాటికి అన్ని రకాల పెండింగ్ పనులను పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు.

బీఎల్వోలకు నైట్ షిఫ్టులు వేయండి

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఈఆర్వోలతో జేసీ కె.ఎస్.విశ్వనాథన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వేగం పెంచాలని, అవసరమైతే బీఎల్వోలకు నైట్ షిఫ్టులు వేయాలని జేసీ సూచించారు. బీఎల్వోలుగా వీఆర్వోలను వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో డీఆర్వో కె.మోహన్‌కుమార్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.61,040
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,950
వెండి(కిలో):	రూ.78,000

20న మిజోరం గవర్నర్ రాక

మహారాణిపేట: మిజోరం గవర్నర్ డాక్టర్ కంభపాటి హరిబాబు ఈనెల 20న విశాఖ వస్తున్నారు. ఆ రోజు సాయంత్రం 6.10 గంటలకు హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా దసపల్లా హిల్స్‌లోని తన ఇంటికి వెళతారు. రాత్రి అక్కడే ఉంటారు. 21 నుంచి 26 వరకు గవర్నర్ డ్యూటీ నుంచి డిశ్చార్జ్ అవుతారు. 27న మధ్యాహ్నం 3.25 గంటలకు విశాఖ నుంచి కోల్‌కతా వెళతారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.75
బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
స్కిన్	: రూ.160
స్కిన్‌లెస్	: రూ.170

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	525.00
విజయనగరం	529.00
శ్రీకాకుళం	529.00